రుణమాఫీ కోసం నేడు ధర్నాలు

- రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పశ్యపద్మ పిలుపు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రైతులందరికీ లక్ష వరకు రుణమాఫీ జాప్యం లేకుండా చేయాలని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బాగం హేమంతరావు, పశ్యపద్మ ఆదివారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రుణ మాఫీ సాధనకోసం సోమవారం రాష్ట్ర వ్యాప్తంగా ధర్నాలు నిర్వహించనున్నట్టు తెలిపారు. 2018 డిసెంబర్ 11 నాటికి బ్యాంకుల్లో పంట రుణాలు తీసుకున్న రైతులకు రుణమాఫీ చేస్తామంటూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని గుర్తు చేశారు. నాలుగు విడతల్లో అమలు చేస్తామని ప్రకటించిందనీ, అయినా అమలు చేయలేదని పేర్కొన్నారు. దీంతో వడ్డీ భారం తడిసి మోపడవుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. రూ. 25 వేల వరకు పంట రుణాలు పొందిన వారికి మాత్రమే 2020లో మాఫీ చేసిందని, రూ. 50 వేల వరకు రుణమాఫీ చేస్తామంటూ ఉప ఎన్నికల సందర్భంగా సిఎం ప్రకటించి, కేవలం ఐదు శాతం మంది రైతులకు మాత్రమే మాఫీ చేశారని తెలిపారు. ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని రుణమాఫీ 45 రోజుల్లో చేస్తామని ప్రకటించారని పేర్కొన్నారు. సగం మంది రైతులకైనా రుణమాఫీ జరగలేదని తెలిపారు.

ఎన్నికల షెడ్యూలులోపు బదిలీలు పూర్తి చేయాలి

- సిఎం కెసిఆర్‌కు ఎమ్మెల్సీ అలుగుబెల్లి లేఖ

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

ప్రభుత్వ మండల, జిల్లా పరిషత్ పాఠశాలలు, మోడల్ స్కూళ్లలోపని చేస్తున్న ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులను ఎన్నికల షెడ్యూలు విడుదలయ్యేలోపు పూర్తి చేయాలని ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు ఆదివారం సిఎం కెసిఆర్‌కు ఆయన లేఖ రాశారు. ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు మధ్యలో ఆగిపోతున్నాయనీ, హై కోర్టులో కేసులు పడుతున్నాయనీ, ప్రతి కేసుపై స్టేలు కూడా సులభంగా వస్తున్నాయని తెలిపారు. కోర్టు స్టేలను తొలగించటం రాష్ట్ర ప్రభుత్వ పాఠశాల విద్య డైరెక్టరేటుకు సాధ్యం కావటం లేదని పేర్కొన్నారు. ఈ విషయంలో పాఠశాల విద్యాశాఖ తగిన శ్రద్ధ చూపటం లేదని, ప్రభుత్వ అడ్వకేటుకు సరైన సమాచారాన్ని ఇవ్వడంలో వైఫల్యం ఉందని తెలిపారు. పాఠశాల విద్యాడైరెక్టరేట్ అలా తయారు కావటానికి కేంద్రీకృత పాలనే కారణమని ఆరోపించారు. ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల గురించి పలు మార్లు ప్రకటించినా "ఎక్కడేసిన గొంగళి అక్కడే అన్నచందంగా" ఉందని గుర్తు చేశారు.

విఓఎల సమస్యలను పరిష్కరించాలి

- లేకుంటే కెసిఆర్‌కు గుణపాఠం చెప్తాం : ఎస్‌వి రమ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్ర ప్రభుత్వం ఐకెపి విఓఎల సమస్యలను వెంటనే పరిష్కరించాలని, లేని పక్షంలో వచ్చే ఎన్నికల్లో సిఎం కెసిఆర్‌కు తగిన గుణపాఠం చెబుతామని తెలంగాణ ఐకెపి విఓఎ ఉద్యోగుల సంఘం (సిఐటియు అనుబంధం) రాష్ట్ర గౌరవాధ్యక్షులు ఎస్‌వి రమ హెచ్చరించారు. హైదరాబాద్‌లోని సిఐటియు రాష్ట్ర కార్యాలయంలో ఆదివారం ఆ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు కె రాజ్‌కుమార్ అధ్యక్షతన సమావేశం జరిగింది. అనంతరం రమ మీడియాతో మాట్లాడారు. 44 రోజుల సమ్మె అనంతరం ఆగస్టు 29న మంత్రులు హరీశ్‌రావు, ఎర్రబెల్లి దయాకర్ రావు అనేక హామీలిచ్చారన్నారు. విఓఎల వేతనాల పెంపు, డ్రెస్ కోడ్ ఇవ్వడం, పెండింగ్ వేతనాల చెల్లింపు, మూడు నెలలకోసారి ఉన్న రెన్యూవల్‌ను ఏడాదికోసారి చేస్తామన్న హామీల్లో ఒక్కటైనా నెరవేరలేదని చెప్పారు. విఓఎలను కూరలో కరివేపాకులాగా రాష్ట్ర సర్కారు వాడుకుంటోందని, ఇదే వైఖరి కొనసాగితే రాబోయే రోజుల్లో వారు తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. సమావేశంలో ఆ యూనియన్ ప్రధాన కార్యదర్శి ఎం.నగేశ్, కార్యనిర్వాహక అధ్యక్షులు సుధాకర్, కోశాధికారి సుమలత, వెంకటయ్య, అంజికుమార్, జ్యోతి, అరుణ, శ్రీను, రమేశ్, బీమేశ్, తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరు ఐపిఎస్‌లు బదిలీ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఇద్దరు ఐపిఎస్ అధికారులను బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సిఎస్) శాంతికుమారి ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం ఎసిబి డైరెక్టర్‌గా ఉన్న ఎఆర్ శ్రీనివాస్‌ను రాష్ట్ర పోలీసు అకాడమీ అదనపు డైరెక్టర్‌గా నియమించారు. హోం గార్డ్స్ అండ్ టెక్నికల్ సర్వీసెస్ డిఐజి అంబర్ కిషోర్ ఝాను రాచకొండ జాయింట్ కమిషర్‌గా నియామిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

ఎన్నికల్లో పోటీచేయను

- బండ్ల గణేష్ వెల్లడి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసే అంశంపై సినీ నిర్మాత బండ్ల గణేశ్ క్లారిటీ ఇచ్చారు. ఎన్నికల్లో ఎమ్మెల్యేగా పోటీ చేయడంలేదని తెలిపారు. కూకట్‌పల్లి స్థానం నుంచి కాంగ్రెస్ తరఫున బరిలోకి దిగనున్నారనే ప్రచారం నేపథ్యంలో బండ్ల గణేశ్ స్పందించారు. ఈ మేరకు ఆయన ఆదివారం ట్వీట్ చేశారు.

"ఈసారి జరిగే ఎన్నికల్లో నేను ఎమ్మెల్యేగా పోటీ చేయడంలేదు. పిసిసి అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి నాకు అవకాశం ఇస్తామని చెప్పారు. కానీ నాకు ఈసారి టికెట్ వద్దు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ముఖ్యం.. దానికోసం పనిచేస్తాను. రేవంతన్న మీ ప్రేమకు కృతజ్ఞుణ్ణి. నేను టికెట్ కోసం కూడా దరఖాస్తు చేయలేదు. ఈసారి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావటమే నా ధ్యేయం.. తప్పకుండా అధికారంలోకి వస్తుంది. రేవంత్‌రెడ్డి నాయకత్వంలో పనిచేస్తాం" అని ఆయన పేర్కొన్నారు. గత ఎన్నికల్లో ఆయన కాంగ్రెస్‌కు ప్రచారం చేసిన సంగతి తెలిసిందే.

'హస్తం' వాసిలో 'సర్వే'త్రా ఆసక్తి

- కాంగ్రెస్ టికెట్లపై కొనసాగుతున్న ఉత్కంఠ
- పొత్తులు.. ఎత్తులపై చర్చోపచర్చలు కీలకంగా మారనున్న కమ్యూనిస్టులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కాంగ్రెస్ పార్టీ టికెట్ల కేటాయింపుపై 'సర్వే'త్ర ఆసక్తి నెలకొంది. ఎన్నికల షెడ్యూల్‌కు సమయం ఆసన్నమవుతున్నా... దరఖాస్తులు స్వీకరించి నెల రోజులు కావస్తున్నా టికెట్ల కేటాయింపు జాప్యం అవుతుండడంపై కాంగ్రెస్ కార్యకర్తల్లో ఉత్కంఠ నెలకొంది. కాంగ్రెస్ పార్టీ అధిష్టానం ఉద్దేశపూర్వకంగానే టికెట్ల కేటాయింపులో జాప్యం చేస్తోందన్న అభిప్రాయం ఆ పార్టీ నేతల్లో వ్యక్తమవుతోంది. కమ్యూనిస్టు పార్టీలతో పొత్తు, షర్మిల పార్టీ విలీనం తుది దశకు చేరాయి. ఈ రెండింటి పై స్పష్టత వస్తే ఎన్నికల షెడ్యూల్ వచ్చేలోపే కాంగ్రెస్ టికెట్ల కేటాయింపు పూర్తవుతుందని ఆ పార్టీ రాష్ట్రస్థాయి కీలక నేతలు కొందరు చెబుతున్నారు.

ఆశావహుల్లో టెన్షన్..

అసెంబ్లీ ఎన్నికలకు షెడ్యూల్ సమీపిస్తున్నా కొద్దీ వెయ్యికి పైగా ఉన్న కాంగ్రెస్ ఆశావహుల్లో టెన్షన్ పెరిగిపోతోంది. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో వందకు పైగా ఉన్న దరఖాస్తుదారుల్లోనూ ఇదే పరిస్థితి. ఈ నెల మొదటి వారంలో తొలి జాబితా విడుదల అవుతుందని వార్తలు వచ్చాయి. ఎన్నికల షెడ్యూల్ కంటే ముందే అభ్యర్థుల ప్రకటన ఉంటుందని అంచనా వేసినా అది సాధ్యమయ్యే అవకాశాలు మాత్రం కనిపించడం లేదు. ఎన్నికల షెడ్యూల్ ఖరారైతే అదే రోజుగానీ మరుసటి రోజు మొదటి జాబితా ప్రకటన ఉంటుందని పిసిసి నేతలు ఆశావహులకు సమాచారం ఇచ్చినట్టు తెలిసింది. 30 నియోజకవర్గాలకు ఒకే దరఖాస్తు రావడంతో వీరి అభ్యర్థిత్వానికి హైకమాండ్ ఓకే చెప్పినట్టు తెలుస్తోంది. మరో 30 నియోజకవర్గాల్లో అభ్యర్థుల జాబితా కొలిక్కి వచ్చినట్టు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఓ ముప్పై నియోజకవర్గాల్లో టికెట్ల కోసం గట్టి పోటీ ఉండడంతో మరొకసారి సర్వేలు నిర్వహించాలని స్క్రీనింగ్ కమిటీ నిర్ణయించింది. ఈ నెల 7వ తేదీన పార్టీ కేంద్ర ఎన్నికల కమిటీ సమావేశం జరుగుతుందని అనుకున్నా అదీ జరగలేదు. ఈ వారంలో పార్టీ కేంద్ర ఎన్నికల కమిటీ సమావేశమై తెలంగాణతో పాటు మిగిలిన రాష్ట్రాలకు అభ్యర్థుల ఎంపికపై తుది నిర్ణయం తీసుకుంటుందని కాంగ్రెస్ వర్గాలు చెబుతున్నాయి. కేంద్ర ఎన్నికల కమిటీ తేదీ ఖరారైన వెంటనే, స్క్రీనింగ్ కమిటీ సమావేశమై మొదటి జాబితాకు దాదాపు 70 నియోజకవర్గాలకు అభ్యర్థుల పేర్లను ఖరారు చేసే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

27 నియోజకవర్గాల్లో రీ సర్వేలు..

సూర్యాపేట, జనగామ, ఖైరతాబాద్, ఎల్బీనగర్, జూబ్లీహిల్స్, మిర్యాలగూడ, భువనగిరి తదితర 27 నియోజకవర్గాలల్లో రీ సర్వేలు చేసినట్టు సమాచారం. గెలుపే లక్ష్యంగా పారదర్శకంగా అభ్యర్థుల ఎంపిక ఉంటుందని పిసిసి వర్గాలు చెబుతున్నాయి. గతంలోనూ అభ్యర్థుల ఎంపిక ప్రక్రియ ఆలస్యం కావడం పార్టీ గెలుపుపై ఆ ప్రభావం తీవ్రంగా చూపినట్టు రాష్ట్ర నాయకత్వం అంచనా వేస్తోంది. అలాంటప్పుడు ముందస్తుగా అభ్యర్థుల ప్రకటన చేయాలని భావిస్తున్నప్పటికీ అవకాశాలు కనిపించడంలేదని కాంగ్రెస్ వర్గాలు వెల్లడిస్తున్నాయి. అయితే కొత్తగా పార్టీలో చేరుతున్న వారిని ఎక్కడ? ఎలా? అడ్జస్ట్ చేస్తారనేది కూడా ఆసక్తికరంగా మారింది.

ప్రభుత్వ వ్యతిరేక ఓటు చీలకుండా వ్యూహాలు..

వివిధ పథకాల లబ్ధిదారుల ఎంపికలో అధికార పార్టీ ఏకపక్షంగా వ్యవహరిస్తోంది. మొదటినుంచి ఇదే పరిస్థితి ఉండడంతో ప్రభుత్వ వ్యతిరేకత భారీగా పెరిగింది. ఈ నేపథ్యంలో ప్రభుత్వ వ్యతిరేక ఓటు చీలకుండా చూసుకోవాల్సిన బాధ్యత ప్రధానంగా కాంగ్రెస్ పైనే ఉంది. కాబట్టి ప్రభావితం చేయగల భావ సారూప్య పార్టీలతో ఆ పార్టీ చర్చలు జరుపుతోంది. ఈ వారంలో ఈ చర్చలూ ఓ కొలిక్కి వచ్చే అవకాశం ఉంది. ఈ వ్యవహారంలో కమ్యూనిస్టు పార్టీలు కీలకంగా మారనున్నాయి. కాబట్టి ఆ పార్టీల నేతలతో కాంగ్రెస్ పెద్దలు చర్చలు జరుపుతున్నారు. ఈ చర్చలూ ఫలప్రదమైనట్టు తెలుస్తోంది. కాబట్టి ఈ వారంలో కాంగ్రెస్ అభ్యర్థుల జాబితా కచ్చితంగా వెలువడే అవకాశాలు ఉన్నాయని విశ్వసనీయ సమాచారం. కమ్యూనిస్టులతో పొత్తు నేపథ్యంలో ఉమ్మడి ఖమ్మం, ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఎవరి పేర్లు ఉంటాయనేదే ఇప్పుడు సర్వత్రా ఆసక్తిగా మారింది. ప్రత్యర్థి బిఆర్ ఎస్ అధినేత అభ్యర్థులను ప్రకటించి ఇప్పటికే నెల రోజులకు పైగా అవుతున్న దృష్ట్యా కాంగ్రెస్ పార్టీ జాబితా ఎలా ఉండబోతుందనే అంశం చర్చనీయాంశంగా మారింది. భారీగా దరఖాస్తుదారులు ఉన్న నియోజకవర్గాలు, కీలక నేతలు పోటీపడుతున్న స్థానాలపైనే అందరి దృష్టి కేంద్రీకృతమై ఉంది.

ఆర్‌టిసి ఛైర్మన్‌గా ముత్తిరెడ్డి బాధ్యతలు స్వీకరణ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తనపై నమ్మకంతో ప్రభుత్వం ఆర్‌టిసి ఛైర్మన్ బాధ్యతలు అప్పగించిందని, తన శక్తి మేరకు సంస్థ అభివృద్ధికి పాటుపడతానని టిఎస్ ఆర్‌టిసి ఛైర్మన్ ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి పేర్కొన్నారు. సంస్థ ఉద్యోగులతో పాటు తానూ సమష్టిగా పనిచేసి ఆర్‌టిసి అభివృద్ధికి తోడ్పడతానన్నారు. ఆర్‌టిసి నూతన ఛైర్మన్‌గా ముత్తిరెడ్డి యాదగిరి రెడ్డి ఆదివారం బస్‌భవన్‌లో పదవీ బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. సంస్థను లాభాల బాటలోకి తీసుకెళ్ల డంలో తనవంతు కృషి చేయనున్నట్టు చెప్పారు. టిఎస్‌ఆర్‌టిసి ఛైర్మన్‌గా తనను నియమించిన సిఎం కెసిఆర్‌కు ముత్తిరెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. అనుభవజ్ఞులైన ఎండి సజ్జనార్ నేతృత్వంలో టిఎస్‌ఆర్‌టిసి అన్ని విభాగాల్లో దూసుకుపోతోందన్నారు. ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డికి సంస్థ ఎండి విసి సజ్జనార్, ఇతర ఉన్నతాధికారులు శుభాకాంక్షలు తెలిపారు.

లోక్‌సభ బరిలో ఉంటా : జానారెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

వచ్చే ఎన్నికల్లో లోక్‌సభ బరిలో ఉంటానని మాజీ మంత్రి కుందూరు జానారెడ్డి అన్నారు. ఆదివారం హాలియాలో జరిగిన కాంగ్రెస్ పార్టీ సభలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో 60 ఏళ్లలో కాంగ్రెస్ పార్టీ 75 వేల కోట్ల అప్పు చేస్తే తొమ్మిదేళ్లలో బిఆర్‌ఎస్ రూ. 5,60,000 కోట్లు అప్పు చేసిందని, దేశంలో తొమ్మిదేళ్లలో రూ.112 లక్షల కోట్లు మోడీ ఖర్చు చేశారని అన్నారు.

కాంగ్రెస్ పార్టీ సభలో మాట్లాడుతున్న జానారెడ్డి

మోడీ, కెసిఆర్‌లు చేసిన అవినీతిపై ఒకరిపై మరొకరు మాట్లాడుతున్నారని, రైతుబంధు పేర మధ్య తరగతి రైతులకు డబ్బులిస్తూ లిక్కర్‌పై పెంచిన ధరలతో ఒక్క కుటుంబం నుండే రూ.40 వేలు వసూలు చేస్తున్నారన్నారు. మద్యం, డబ్బు లేకుండా పోటీ చేయాలని గత ఎన్నికల్లో సవాల్ చేసినా స్వీకరించలేదన్నారు. ఉపఎన్నికలో జానారెడ్డిని ఓడించడానికి శత విధాలా ప్రయత్నం చేసినా దగ్గర ఫలితం సాధించారన్నారు. ప్రజలను చైతన్యవంతం చేయడం కోసం తన వారసులను తయారు చేస్తున్నానని, ఉచిత కరెంటు మొదలు పెట్టిందే కాంగ్రెస్ పార్టీ అని, తమ పార్టీ అధికారంలోకొస్తే 24గంటల విద్యుత్‌ను సరఫరా చేస్తామన్నారు. నాగార్జున సాగర్ నియోజకవర్గ ప్రజలకు అండగా మేమంతా ఉంటామని చెప్పారు.

బతుకమ్మ ఆడుతూ హన్మకొండలో ఆశా వర్కర్ల నిరసన

- పలు చోట్ల వివిధ రూపాల్లో ఆందోళనలు

నిరసన తెలుపుతున్న ఆశా వర్కర్లు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఆశా వర్కర్లకు ఫిక్స్ వేతనం రూ.18 వేలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ గత 14 రోజులుగా సమ్మె చేస్తున్న ఆశా వర్కర్లు ఆదివారం హనుమకొండ జిల్లా ఏకశిలా పార్కు వద్ద బతుకమ్మ ఆడుతూ నిరసన తెలిపారు. సిఎం కెసిఆర్, మంత్రి కెటిఆర్ దృష్టి సారించి ఆశలతో వెట్టిచాకిరి ఆపాలని కనీస వేతనాలు ఇవ్వాలని, పనికి గుర్తింపు ఇవ్వాలని ఉయ్యాల రూపకంగా పాటలు పాడుతూ మూడు గంటల పాటు నిరసన తెలిపారు. తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ (సిఐటియు) గౌరవాధ్యక్షులు రాగుల రమేష్ మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేనివిధంగా ఆశలకు వేతనాలు ఇస్తున్నామని మంత్రులు చెప్పడం సరికాదన్నారు. హర్యానా రాష్ట్రంలో ఆశా వర్కర్లకు రూ.14,000 ఫిక్స్ వేతనం ఇస్తున్నారని, పాండిచ్చేరి రాష్ట్రంలో రూ.పది వేలు వేతనం ఇస్తున్నారని వివరించారు. ప్రభుత్వం ఆశాల యూనియన్ తో చర్చలు జరిపి వారి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ సిఐటియు నాయకులు యాకూబీ, సీహెచ్ శ్రీవాణి, కరుణలత, సుభాషిని, జె శ్వేత, సింగారపు రమ, పద్మ పుష్ప ,రూప, శారద పాల్గొన్నారు ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని మర్రిగూడ, భువనగిరిలో ఆశా వర్కర్లు వటావార్పు చేసి నిరసన వ్యక్తం చేశారు. తిప్పర్తి మండలంలో గాంధీ విగ్రహానికి వినతిపత్రం అందజేసి నిరసన తెలిపారు. పెన్‌పహాడ్‌లో భిక్షాటన చేశారు.

ఆశా వర్కర్లకు ప్రభుత్వ ఉద్యోగ భద్రత కల్పించాలి : పాలడుగు భాస్కర్

ఆశా వర్కర్లకు తెలంగాణ ప్రభుత్వం ఉద్యోగ భద్రత కల్పించి, రూ.18వేలు ఫిక్స్‌డ్ వేతనాన్ని చెల్లించాలని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ డిమాండ్ చేశారు. మహబూబాబాద్ జిల్లా గార్ల మండలంలోని నెహ్రూ సెంటర్‌లో జరుగుతున్న సమ్మెకు ఆయన సంఘీభావం తెలిపారు. నిరంతరం ప్రతి ఇంటికి తిరిగి వెళ్ళి ప్రజల ఆరోగ్య సంరక్షణ కోసం విధులు నిర్వహిస్తున్న ఆశాలు చాలీచాలని వేతనాలతో కుటుంబాలను పోషించుకుంటూ ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆందోళన వెలిబుచ్చారు. ఆశాల సమస్యల పరిష్కారానికి చేస్తున్న సమ్మెకు తమ మద్దతు ఉంటుందన్నారు. సిఐటియు మండల కన్వీనర్ కందునూరి శ్రీనివాస్ సంఘీభావం తెలుపగా ఆశాల యూనియన్ నాయకులు పి రమాదేవి, ఉమాదేవి, పుష్ప, ఎం రమణ, నమ్మి, ఆశా కుమారి, విజయలక్ష్మి,సుజాత, కౌసల్య, శాంత, నాగమణి, భద్రమ్మ, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

కెసిఆర్ పాలన స్వర్ణయుగం

- అన్ని రంగాల్లో తెలంగాణ అగ్రగామి
- బిఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కవిత

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సిఎం కెసిఆర్ పాలన తెలంగాణలో స్వర్ణయుగాన్ని తీసుకొచ్చిందని, అన్ని రంగాల్లో రాష్ట్రం అగ్రగామిగా నిలబడిందని బిఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత తెలిపారు. లండన్ పర్యటనలో ఉన్న కవిత నేషనల్ ఇండియన్ స్టూడెంట్స్ అండ్ అలుమ్ని అసోసియేషన్ - యుకె (ఎన్ఐఎస్ఎయు) సభ్యులతో సంభాషించారు. విద్యార్థులు అడిగిన పలు ప్రశ్నలు సమాధానాలు ఇచ్చారు. మహిళా రిజర్వేషన్లు, తెలంగాణ అభివృద్ధి, తన రాజకీయ జీవితం వంటి అంశాలపై తన అభిప్రాయాన్ని పంచుకున్నారు.

తెలంగాణ ఏర్పడిన వెంటనే సకల జనుల సర్వే నిర్వహించామని, దాని వల్ల రాష్ట్రంలోని ప్రజల సామాజిక ఆర్థిక స్థితిగతుల వివరాలను సేకరించామని తెలిపారు. ప్రజలను పైకి తేవడానికి ప్రస్తుతం ఆ వివరాలు ప్రభుత్వానికి ఎంతగానో ఉపయోగపడుతున్నాయని చెప్పారు. సిఎం కెసిఆర్ ప్రభుత్వం కులవృత్తుల వారికి అనేక ప్రోత్సాహకాలు అందిస్తూ ప్రోత్సహిస్తోందన్నారు. ఉదాహరణకు చెరువులు మరమ్మతు చేసి ఉచితంగా చేప పిల్లలు పంపిణీ చేయడం వల్ల రాష్ట్రంలోని మత్స్యకారుల జీవితాల్లో గణనీయమైన మార్పు సంభవించిందని వివరించారు. దళిత బంధు వంటి పథకాల వల్ల ఆ వర్గాల్లో ఆర్థిక శక్తి పెరిగిందని, ఆ వర్గాల వారు పరిశ్రమలు స్థాపించే స్థాయికి ఎదిగాయని పేర్కొన్నారు. వ్యవస్థీకృత డెలివరీలను ప్రోత్సహించడానికి గానూ శిశువులకు జన్మనిచ్చిన తల్లులకు కెసిఆర్ కిట్లు పంపిణీ చేస్తున్నామన్నారు. తెలంగాణ విద్యా వ్యవస్థలోనూ సమూల మార్పులు వచ్చాయని చెప్పారు. క్రీడలనూ ప్రోత్సహిస్తున్నామని, ప్రభుత్వం అందించిన ప్రోత్సాహంతో సాంఘిక సంక్షేమ పాఠశాలలో చదివే మాలవత్ పూర్ణ మౌంట్ ఎవరెస్ట్‌ను అధిరోహించిందని ప్రస్తావించారు. మైనారిటీలకు ప్రత్యేక రెసిడెన్షియల్ పాఠశాలలను నెలకొల్పామని, తద్వారా మైనార్టీలు గతంలో ఎప్పుడూ లేనంతగా పాఠశాలలకు వెళ్తున్నారని తెలిపారు. మోడల్ పాఠశాల్లో ఇంగ్లీష్ మీడియంలో బోధిస్తున్నామని, ప్రతి జిల్లా కేంద్రంలో ఎస్‌సి, ఎస్‌టిల కోసం ప్రత్యేకంగా హాస్టల్‌తో కూడిన డిగ్రీ కాలేజీలను ఏర్పాటు చేశామన్నారు. రాష్ట్రంలో అంగన్ వాడీ కార్యకర్తలకు రూ.20 వేల వేతనం లభిస్తోందని వివరించారు. హరితహారం, మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ వంటి పథకాల గురించి కవిత వివరించారు.

సిఎం కెసిఆర్ కృషి వల్ల తెలంగాణ ప్రగతి పథంలో నడుస్తోందని, సంపద సృష్టించి గ్రామీణ ప్రాంతాల్లో ఆర్థిక పరిపుష్టి చేయాలన్నది తమ అధినేత కెసిఆర్ ఆలోచన అని తెలిపారు. సిఎం కెసిఆర్ తెలంగాణ కోసం చిత్తశుద్ధితో పనిచేశారని చెప్పడంలో సందేహమే లేదని, తెలంగాణ ఏర్పాటు కావడమే తన లక్ష్యమని పదువులు ముఖ్యం కాదని కెసిఆర్ అన్నారని మాజీ రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ తన పుస్తకంలో రాసిన విషయాన్ని గుర్తు చేశారు. తాను ఎన్నికల ప్రచారం చేస్తున్న క్రమంలో ఒక గ్రామీణ మహిళా తనకు ఒక వెయ్యి రూపాయల ఆదాయం ఎక్కువగా వస్తే పిల్లలను చదివించుకోగలనని అన్నారని, ఆ సమయంలోనే ప్రజాజీవితంలోకి వచ్చి ప్రజల జీవితాల్లో మార్పు తేవడానికి కృషి చేయాలని నిర్ణయించుకున్నానని వెల్లడించారు. అయితే, నేరుగా రాజకీయాల్లోకి రాకుండా తెలంగాణ జాగృతి సంస్థను స్థాపించానని తెలిపారు. ఆ సంస్థ ద్వారా మహిళా సాధికారతకు కార్యకలాపాలు చేపట్టడమే కాకుండా తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను ప్రోత్సహించామని, ముఖ్యంగా బతుకమ్మ పండగను ప్రతీ ఏటా పెద్ద ఎత్తున నిర్వహిస్తూ వచ్చామని వివరించారు. ప్రస్తుతం 65-70 దేశాల్లో బతుకమ్మ ఉత్సవాలు జరుగుతున్నాయని చెప్పారు. తాను ప్రజాజీవితంలోకి వచ్చిన తర్వాత తరుచూ లేవనెత్తిన అంశాల్లో మహిళా రిజర్వేషన్ల అంశం ఒకటని తెలిపారు. భూప్రపంచంలో కేవలం మానవ సమూహంలో మాత్రమే మహిళల పట్ల వివక్ష ఉందని, సమాన అవకాశాలు లభించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళా రిజర్వేషన్ల బిల్లు కోసం గతేడాది నవంబరు నుంచి తాను ఉద్యమాన్ని ఉధతం చేశానని, ఈ ఏడాది మార్చి నెలలో ఢిల్లీలో భారీ ధర్నా నిర్వహించానని, రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహించానని వివరించారు. తమ పార్టీ తరపున పార్లమెంటులో ప్రయివేటు మెంబర్ బిల్లును ప్రవేశపెట్టామని, ఇతర రాజకీయ పార్టీలపైనా ఒత్తిడి తీసుకొచ్చామని వివరించారు. మహిళా రిజర్వేషన్లపై ప్రజల్లో అవగాహన వస్తోందని తెలిపారు. మరోవైపు, మహిళా భద్రత గురించి తెలంగాణ ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుందని, షీ టీమ్స్ ఏర్పాటు చేసిందని చెప్పారు.

సభలో మాట్లాడుతున్న స్కైలాబ్ బాబు

సనాతన ధర్మం అశాస్త్రీయమైనది

- కెవిపిఎస్ ప్రధాన కార్యదర్శి స్కైలాబ్ బాబు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సనాతన ధర్మం ఆశాస్త్రీయమైందని, రాజ్యాంగ ధర్మమే సర్వోన్నతమైందని కెవిపిఎస్ రాష్ట్ర కార్యదర్శి తప్పెట్ల స్కైలాబ్ బాబు అన్నారు. కెవిపిఎస్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఆదివారం నల్లగొండ జిల్లా కేంద్రంలో కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి పాలడుగు నాగార్జున జెండా ఆవిష్కరణ చేశారు. అనంతరం 'సనాతన ధర్మమా.. రాజ్యాంగ ధర్మమా' అనే అంశంపై సభ జరిగింది కెవిపిఎస్ జిల్లా అధ్యక్షుడు కొండేటి శ్రీను అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో స్కైలాబ్ బాబు మాట్లాడుతూ కెవిపిఎస్ ఏర్పడి 25 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా అక్టోబర్ రెండు నుండి తొమ్మిది వరకు కెఇవిపిఎస్ ఆవిర్భావ వారోత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు. హిందు మతంలోనే కాదు, ముస్లిం, క్రిస్టియన్ మతంలో కూడా అంతరాలను పెంచి పోషిస్తున్న సనాతన భావాలు ఉన్నాయన్నారు. పాతకాలంలో సనాతన ధర్మం అంటే భర్త చనిపోతే భార్యనూ తీసుకొచ్చి చితిలో వేసేవారని, బతికున్న భార్యను కూడా భర్త శవం పక్కన పెట్టి కాలబెట్టడం సనాతన ధర్మమా అని ప్రశ్నించారు. ఈ ధర్మాన్ని ఈ ఆధునిక యుగంలో కొనసాగిద్దాం అంటే అంగీకరిస్తారా.! అని ప్రశ్నించారు. 18 సంవత్సరాల నిండిన ప్రతి ఒక్కరికి ఓటు హక్కు ఉండాలని, అన్ని కులాల్లో బతుకుతున్న వారికి రాజ్యాంగం హక్కులను ప్రసాదించిందని ఇది రాజ్యాంగ ధర్మం గొప్పతనం తప్ప సనాతన ధర్మం గొప్పతనం ఏ మాత్రం కాదన్నారు. పాలడుగు నాగార్జున మాట్లాడుతూ కెవిపిఎస్ చేసిన పోరాటాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు డాక్టర్ గాదె లింగస్వామి, పందుల సైదులు, గంజి మురళీధర్, ఎడ్ల సైదులు, బండ శ్రీశైలం, సయ్యద్ హష్మీ, మానుపాటి భిక్షమయ్య, రాయల సీతారాములు, సిహెచ్.లక్ష్మీనారాయణ, మంజుల, సలీం, నరేష్, కొండేటి మురళి, కెవిపిఎస్ జిల్లా నాయకులు రెమిడాల పరుశరాములు, జిట్టా నగేష్ గాదే నరసింహ, బొల్లు రవీందర్, కోడి రెక్క మల్లన్న, దైద శీను, ఒంటెపాక కృష్ణ, కొండ వెంకన్న,తదితరులు పాల్గొన్నారు.

బోర్లాగ్ సదస్సుకు మంత్రులు కెటిఆర్, నిరంజన్ రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ మంత్రులు కల్వకుంట్ల తారకరామారావు, నిరంజన్‌రెడ్డికి అంతర్జాతీయ సదస్సులో పాల్గొనాలని ఆహ్వానం అందింది. ప్రపంచ హరిత విప్లవ పితామహుడు నార్మన్ బోర్లాగ్ పేరు మీదుగా నిర్వహిస్తోన్న బోర్లాగ్ ఇంటర్నేషనల్ సమావేశంలో తెలంగాణ ప్రగతి ప్రస్థానంపై ప్రసంగించాల్సిగా సంస్థ ప్రతినిధులు మంత్రులకు సదస్సు స్వాగతం పలికింది. ఈ నెల 24 నుంచి 26వ తేదీ వరకు అమెరికాలోని అయోవా రాష్ట్రం డెమోయిన్ నగరంలో సదస్సుకు హాజరుకావాల్సి ఉండగా.. కెటిఆర్, నిరంజన్‌రెడ్డి పర్యటనకు ప్రభుత్వం అనుమతి ఇస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ప్రపంచ హరిత విప్లవ పితామహుడు నార్మన్ బోర్లాగ్ పేరుపై ఏటా సదస్సులు నిర్వహిస్తుండగా.. హాజరుకావాలని మంత్రి కెటిఆర్‌ను 'వరల్డ్ ఫుడ్ ప్రైజ్ ఫౌండేషన్' అధ్యక్షుడు ఆహ్వానించారు. తెలంగాణ ప్రభుత్వ వ్యవసాయ అనుకూల విధానాలు, పురోగతిని గమనించి.. వ్యవసాయంలో పదేళ్లలో సాధించిన ప్రగతి ప్రస్థానంపై ప్రసంగించాలని మంత్రులకు ఆహ్వానం పంపింది. ఇక సదస్సులో ప్రపంచ వ్యవసాయరంగంలో ఆహార భద్రతకు ఎదురయ్యే సవాళ్లపై చర్చించనున్నారు. ప్రపంచ దేశాల నుంచి 1200 మంది ప్రతినిధులు ఈ సదస్సుకు హాజరుకానున్నారు. అలాగే ఆన్‌లైన్ ద్వారా వేలాది మంది పాల్గొననున్నారు. ఈ క్రమంలో ఈ నెల 22 నుంచి 29 వరకు మంత్రులు కేటీఆర్, సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి అమెరికాకు వెళ్లనున్నారు. కార్యక్రమంలో ఆర్థిక శాఖ కార్యదర్శి రామకృష్ణారావు, వ్యవసాయ శాఖ కార్యదర్శి రఘునందన్ రావు బృందం సైతం అమెరికాకు వెళ్లనున్నది.

బిఎల్‌ఎఫ్ బలపరిచిన భాగస్వామ పార్టీల అభ్యర్థుల పేర్లు ప్రకటిస్తున్న సూర్యప్రకాష్

బహుజన రాజ్యస్థాపనే బిఎల్‌ఎఫ్ లక్ష్యం : ఛైర్మెన్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణలో బహుజనులకు రాజ్యస్థాపనే లక్ష్యంగా బిఎల్‌ఎఫ్ పనిచేస్తోందని బిఎల్‌ఎఫ్ ఛైర్మెన్ నల్ల సూర్యప్రకాష్ అన్నారు. బిఎల్‌ఎఫ్ బలపరిచిన భాగస్వామ పార్టీల 18 మంది అభ్యర్థుల తొలి జాబితాను ఆదివారం ఆయన విడుదల చేశారు. రాబోయే ఎన్నికలలో తెలంగాణలో 119 సీట్లకు బిఎల్‌ఎఫ్ పోటీ చేస్తోందని సూర్యప్రకాశ్ వెల్లడించారు. ఇప్పటి వరకు ఏ పార్టీలూ నూటికి 93 శాతంగా ఉన్న ఎస్‌సి, ఎస్‌టి, బిసి మైనార్టీ వర్గాలకు రాజకీయ ఆర్థిక సామాజిక సమానత్వం చూపించలేదన్నారు. అభ్యర్థుల పేర్లు ప్రకటించారు. కామారెడ్డి -ఎస్. సిద్ధి రాములు, నాగార్జునసాగర్ - పోతుగంటి కాశి, మిర్యాలగూడ - వాస్కుల గోపి, .హుజూర్ నగర్ - వస్కుల సైదమ్మ, పరకాల - గోనె కుమారస్వామి, నర్సంపేట- పెద్దారపు రమేష్, ఖమ్మం - లిక్కి కృష్ణారావు యాదవ్, నకిరేకల్ - నూనె వెంకటస్వామి, నిజామాబాద్ అర్బన్ - సబ్బని లత, వర్ధన్నపేట - మాస్ సావిత్రి, వరంగల్ పశ్చిమ -గడ్డం నాగార్జున, వరంగల్ తూర్పు- సుంచు జగదీశ్వర్, పటాన్‌చెరు - కర్ర దానయ్య, తుంగతుర్తి - వీర పాపయ్య, అచ్చంపేట- ఎలిమినేటి శ్రీశైలం, తాండూర్ - మారోజు సునీల్, జుక్కల్ కర్రెవార్ నాగేష్, ఎల్బీనగర్ - రాయబండి పాండురంగ చారి ఉన్నారు. ఈ కార్యక్రమంలో ఎంసిపిఐ (యు) రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి, బిఎల్‌ఎఫ్ రాష్ట్ర కన్వీనర్లు దండి వెంకట్, వనం సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల వ్యూహ రచనకు ఢిల్లీకి ఆప్ నేతలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో వ్యూహ రచనపై చర్చించేందుకు ఆప్ కేంద్ర కమిటీ పిలుపు మేరకు ఆమ్ ఆద్మీ పార్టీ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్ నేతత్వంలో ఆప్ ప్రతినిధి బృందం ఢిల్లీ బయలుదేరి వెళ్ళింది. ఆదివారం హైదరాబాద్ రాజీవ్‌గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి బయలుదేరే ముందు సుధాకర్ మీడియాతో మాట్లాడుతూ.. ఢిల్లీ, పంజాబ్ ఆప్ మ్యానిఫెస్టో మాదిరిగా ఉచిత విద్యుత్, నాణ్యమైన విద్య, వైద్యం, నియామకాల్లో 80 శాతం స్థానికులకు ప్రాధాన్యత, 33 శాతం మహిళా ఉపాధితో సహా పలు వాగ్దానాలతో కూడిన మేనిఫెస్టోను రూపొందించినట్టు తెలిపారు. దీనిపై ఆప్ జాతీయ కన్వీనర్, ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్, ఆప్ దక్షణాది రాష్ట్ర ఇంచార్జి, ఎమ్మెల్యే సోమనాథ్ భారతితో కలసి చర్చించిన తరువాత విడుదల చేస్తామని ప్రకటించారు. 119 అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి పోటీ చేసేందుకు అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారనీ, ఆప్ కేంద్ర కమిటీ తుది జాబితాను ఖరారు చేస్తుందని తెలిపారు. ఢిల్లీకి బయలుదేరి వెళ్లిన ప్రతినిధి బృందంలో ఆప్ రాష్ట్ర కోర్ కమిటీ సభ్యులు బుర్ర రాము గౌడ్ తదితరులున్నారు.

రేపు కాంగ్రెస్ పిఎసి భేటీ

- బస్సుయాత్రపై చర్చ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తాజా రాజకీయ పరిస్థితులపై చర్చించేందుకు కాంగ్రెస్ రాజకీయ వ్యవహారాల కమిటీ మంగళవారం సమావేశం కానుంది. అందులో అభ్యర్థుల ప్రకటన ఎప్పుడనేదానిపైనా చర్చించనుంది. ఎన్నికల సమయం దగ్గర పడుతున్న నేపథ్యంలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో బస్సుయాత్ర చేపట్టాలని భావిస్తోంది. అందుకు సంబంధించిన కార్యాచరణను రూపొందించనుంది.

జాషువా సాహిత్యం దళిత జన ఆక్రోశం

- ఎస్‌సి కార్పొరేషన్ పూర్వ చైర్మన్ శ్రీనివాస్

ప్రజాశక్తి-కల్చరల్

జాషువా సాహిత్యం దళిత జనుల ఆక్రోశం, అవేదనల సహితమని రాష్ట్ర ఎస్‌సి కార్పొరేషన్ పూర్వ చైర్మన్ బండ శ్రీనివాస్ అన్నారు. ఇందుకు గొప్ప ఉదాహరణ జాషువా రచించిన గబ్బిలం కావ్యమని పేర్కొన్నారు. శ్రీ త్యాగరాయ గానసభలోని కళా సుబ్బారావు కళా వేదికపై శతాబ్ది పూర్వ మహనీయులు యాదిలో భాగంగా గుర్రం జాషువా సంస్మరణ కార్యక్రమం గానసభ నిర్వహణలో ఆదివారం జరిగింది. ముఖ్య అతిథిగా శ్రీనివాస్ పాల్గొని మాట్లాడుతూ జాషువా రాసిన శిశువు కావ్యం తెలుగు సాహిత్యంలో అత్యుత్తమమైందిగా గుర్తింపు పొందిందని అన్నారు. గాన సభ సంప్రదాయ వాది ఇన విశ్వనాథ సత్యనారాయణతోపాటు దళిత ఉద్యమ కవి ఇన జాషువానూ స్మరిస్తూ సమావేశాలు నిర్వహించడం అభినందించ తగ్గ అంశం అన్నారు. గాన సభ అధ్యక్షుడు కళా జనార్థన మూర్తి అధ్యక్షత వహించిన వేదికపై వేమరాజు విజయ్ కుమార్, నీలా శ్రీధర్, కథక్ అంజిబాబు పాల్గొన్నారు

10న సంగీత దర్శకుడు సాలూరి జయంతి

ప్రజాశక్తి - కల్చరల్

ఈ నెల 10న విఖ్యాత సంగీత దర్శకుడు సాలూరి రాజేశ్వరరావు 101 వ జయంతిని శ్రీ త్యాగరాయ గానసభ ప్రధాన మందిరంలో నిర్వహిస్తున్నట్లు ప్రముఖ సాంస్కృతిక సంస్థ రసమయి నిర్వాహకులు డాక్టర్ ఎంకె రాము తెలిపారు. ముఖ్య అతిథిగా ప్రభుత్వ సలహాదారు డాక్టర్ కెవి రమణ పాల్గొని సాలూరి పేరిట పురస్కారాలను గాయకులు శారద ఆకునూరి, విఎ లక్ష్మి, అమృతవల్లి, వికె దుర్గ, పద్మశ్రీ, పవన్ చరణ్, చింతలపాటి సురేష్, విజయ్ మండపాకలకు బహూకరిస్తారు. రాష్ట్ర జలవనరుల అభివృద్ధి సంస్థ చైర్మన్ డాక్టర్ వేణుగోపాలాచారి, సాలూరి కుమారుడు వాసూరావు పాల్గొనే సభకు దూరదర్శన్ పూర్వ సంచాలకుడు డాక్టర్ మధుసూదనరావు అధ్యక్షత వహిస్తారు.

కోరుట్ల ఆర్‌టిసి డిపోలో అగ్ని ప్రమాదం

- రాజధాని బస్సు దగ్ధం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

జగిత్యాల జిల్లా కోరుట్ల ఆర్‌టిసి డిపోలో ఆదివారం భారీ అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో ఆర్‌టిసి రాజధాని బస్సు పూర్తిగా దగ్ధం అయింది. స్థానికుల వివరాల ప్రకారం.. కోరుట్ల ఆర్‌టిసి డిపోకు చెందిన రాజధాని బస్సులో పెట్రోల్ పోస్తున్న సమయంలో బస్సు బ్యాటరీల నుంచి ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. మంటలు వేగంగా వ్యాపించడంతో బస్సు పూర్తిగా దగ్ధమైంది. ప్రమాదం జరిగిన సమయంలో బస్సులో ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. అగ్నిమాపక సిబ్బంది సమాచారం అందుకుని వచ్చి మంటలను ఆర్పేశారు. ఈ ప్రమాదంపై ఆర్‌టిసి అధికారులు దర్యాప్తు చేస్తున్నారు. బ్యాటరీలలో షార్ట్ సర్క్యూట్ కారణంగానే ప్రమాదం జరిగిందని అనుమానిస్తున్నారు. ఈ ప్రమాదంతో ఆర్‌టిసికి లక్షలాది రూపాయల నష్టం వాటిల్లింది.

చట్టసభల్లో రిజర్వేషన్లు అమలు చేయాలి

– ప్రొఫెసర్ సూరజ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

చట్టసభల్లో బిసిలకు రిజర్వేషన్లు అమలు చేయాలని ప్రొఫెసర్ సూరజ్ మండల్ (బిపి మండల్ మనుమడు) డిమాండ్ చేశారు. ఆదివారం ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల న్యూ సెమినార్ హాల్లో 'చట్ట సభల్లో బిసిలకు రిజర్వేషన్లు' అనే అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఒయు తెలుగు విభాగం హెడ్ ప్రొఫెసర్ సి. కాశీం అధ్యక్షత వహించగా ప్రొఫెసర్ సూరజ్ మండల్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. జనాభాలో 60 శాతం గల బిసిలకు చట్టసభల్లో వారి జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు అమలు చేయాలన్నారు. చట్టసభల్లో బిసిలకు రిజర్వేషన్ల ద్వారానే సామాజిక న్యాయం జరిగి అన్ని వర్గాలు అభివృద్ధి చెందుతారన్నారు.

వైద్య రంగంలో దేశానికే ఆదర్శం

- హోంశాఖ మంత్రి మహ్మమూద్ అలీ
- గాంధీ ఆస్పత్రిలో ఐవిఎఫ్ ఫెర్టిలిటీ సెంటర్ ప్రారంభం

ఐవిఎఫ్ ఫెర్టిలిటీ సెంటర్ ప్రారంభోత్సవంలో మాట్లాడుతున్న మంత్రి మహ్మమూద్ అలీ

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

వైద్య రంగంలో తెలంగాణ దేశానికే ఆదర్శం అని హోంశాఖ మంత్రి మహమూద్‌అలీ అన్నారు. సికింద్రాబాద్ గాంధీ హాస్పిటల్‌లో ఏర్పాటు చేసిన మొట్టమొదటి ప్రభుత్వ ఐవిఎఫ్ కేంద్రాన్ని హోంమంత్రి ప్రారంభించారు. మొదటి ప్రభుత్వ ఐఎఫ్ కేంద్రాన్ని ప్రారంభించడం సంతోషంగా ఉందని హోంమంత్రి అన్నారు. గాంధీ హాస్పిటల్‌తోపాటు వరంగల్ ఎంజిఎం, పేట్లబుర్జు హాస్పిటల్‌లోనూ ఐవిఎఫ్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. హైదరాబాద్‌లో బస్తీ దవాఖానాలు మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నాయన్నారు. ఈ ఐవిఎఫ్ కేంద్రం కార్పొరేట్ ఆస్పత్రులకు మించి సేవలు అందిస్తూ.. దేశానికే ఆదర్శంగా నిలుస్తుందనే నమ్మకం తనకు ఉందన్నారు. ఇలాంటి గొప్ప వైద్య సేవలను ప్రజలకు చేరువ చేయడం సంతోషించదగ్గ విషయం అన్నారు. నగర డిప్యూటీ మేయర్ మోతె శ్రీలతా శోభన్‌రెడ్డి మాట్లాడుతూ ఐవిఎఫ్ అంటే ఇన్ విట్రో ఫెర్టిలైజేషన్, సంతానలేమితో ఇబ్బంది పడుతున్న వారికి సంతాన సాఫల్యం కలిగేందుకు ఉపయోగించే ఖరీదైన చికిత్స అని, పేదవారికి ఉచితంగా అందించాలనే గొప్ప లక్ష్యంతో గాంధీ హాస్పిటల్‌లో రూ.ఐదు కోట్లతో ఈ ఐవిఎఫ్ సెంటర్‌ని అందుబాటులోకి తీసుకు రావడం గొప్ప విషయం అన్నారు. గాంధీ హాస్పిటల్‌లో 2018 నుంచి ఐదేళ్లుగా ఐవిఎఫ్ (ఇంట్రా యూటేరైన్ ఇన్సిమినేషన్) సేవలు అందిస్తున్నట్టు చెప్పారు. ఈ క్రమంలో మరింత మెరుగైన సంతాన సాఫల్యం చికిత్సలను అందుబాటులోకి తీసుకొచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని, అందులో భాగంగా నగరంలోని గాంధీ, పేట్ల బుర్జు మెటర్నిటీ హాస్పిటల్, వరంగల్‌లోని ఎంజిఎం హాస్పిటల్‌లో ఐవిఎఫ్ కేంద్రాలను ప్రారంభించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిఎస్ఎంఎస్ఐడిసి చైర్మెన్ ఎర్రోళ్ల శ్రీనివాస్, గాంధీ హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ రాజారాం, ఇన్‌చార్జి డిఎంఇ రమేశ్‌రెడ్డి, సిఎం ఒఎస్‌డి గంగాధర్‌తోపాటు డాక్టర్లు, బిఆర్ఎస్ కార్మిక విభాగం నాయకుడు మోతె శోబాన్ రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

రాజకీయాల్లో డబ్బు ప్రాధాన్యం తగ్గాలి

- మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాజకీయాల్లో రూ.కోట్లు లేనిదే ఓట్లు రావనే పరిస్థితి ప్రస్తుతం ఏర్పడిందని, అది మారాల్సిన అవసరం ఉందని భారత మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు అభిప్రాయపడ్డారు. భుజంమీద కండువా మార్చినంత సులభంగా నేతలు పార్టీలు మారుతున్నారన్నారు. హైదరాబాద్ ఎంసిఆర్‌హెచ్‌ఆర్‌డిలో ఆదివారం నిర్వహించిన సిటిజన్ యూత్ పార్లమెంట్ కార్యక్రమానికి వెంకయ్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో హోం మంత్రి మహమూద్ అలీ, టిఎస్ఎంఐడిసి చైర్మన్ ఎర్రొళ్ల శ్రీనివాస్ సహా పలువురు ప్రమఖులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడిన వెంకయ్య నాయుడు.. ఓ వ్యక్తి పార్టీ మారితే ఆ పార్టీలో ఉండగా వచ్చిన పదవికి సైతం రాజీనామా చేయాలన్నారు. యువత రాజకీయాల్లోకి రావాల్సిన అవసరం ఉందన్నారు. సిద్ధాంతాలకు కట్టుబడి చేసే రాజకీయాల వల్ల ప్రజలకు ప్రయోజనం కలుగుతుందని అభిప్రాయపడ్డారు. చట్టసభల్లో ఫలవంతమైన చర్చలు జరిగి ప్రజలకు ఉపయోగపడే చట్టాలు రావాలన్నారు. యువత రాజకీయాల్లోకి రావటం ద్వారా భవిష్యత్తు తరాలకు మరింత ప్రయోజనం ఉంటుందని స్పష్టం చేశారు. రాజకీయాల్లోకి వచ్చేందుకు బ్యాక్ గ్రౌండ్ అవసరం లేదని, అందులో రాణించేందుకు అధ్యయనం చేయాలన్నారు.

వైద్య సిబ్బంది నిర్లక్ష్యం

- దుబ్బాక ఆస్పత్రిలో నవజాత శిశువు మృతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

దుబ్బాక ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్యసిబ్బంది నిర్లక్ష్యం ఆడ శిశువు మరణానికి కారణమైంది. ఈ సంఘటన సిద్ధిపేట జిల్లా దుబ్బాక పట్టణంలోని వంద పడకల ఆసుపత్రిలో చోటు చేసుకుంది. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం. రామాయంపేట మండలం కోనాపూర్ గ్రామానికి చెందిన నవనీతకు పురిటి నొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు శనివారం దుబ్బాక ఆస్పత్రికి తీసుకువచ్చారు. ఆ సమయంలో నర్సులు తప్ప వైద్యులు ఎవరూ లేరు. చివరికి రాత్రి 11 గంటల సమయంలో నార్మల్ డెలివరీ చేయగా డెలివరీ అయిన కాసేపటికి నవజాత శిశువు మరణించింది. కుటుంబ సభ్యులు నిలదీయడంతో వైద్య సిబ్బంది ఏమీ చెప్పలేకపోయారు. వైద్య సిబ్బంది నిర్లక్ష్యం మూలంగానే శిశు వు మృతి చెందిందని కుటుంబ సభ్యులు కన్నీటి పర్యంతమయ్యారు. స్టాఫ్ నర్సులపై తగిన చర్యలు తీసుకోవాలని బాధిత కుటుంబీకులు డిమాండ్ చేస్తున్నారు. ఆస్పత్రి ఎదుట ఆందోళన నిర్వహించారు దీనిపై దుబ్బాక పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. నవజాత శిశువు మరణానికి ఆస్పత్రి సిబ్బందే కారణమని నవనీత భర్త స్వామి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ గంగరాజు తెలిపారు.

కోదండరాంతో కాంగ్రెస్ చర్చలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ జన సమితి అధ్యక్షులు ప్రొఫెసర్ కోదండరాంతో కాంగ్రెస్ అధినాయకత్వం చర్చలు జరిపినట్టుగా తెలుస్తున్నది. ఇటీవల ఢిల్లీకి వెళ్లిన కోదండరాం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఖర్గేను కలిసి తమ పార్టీ కాంగ్రెస్ పార్టీతో పొత్తుతో అసెంబ్లీ ఎన్నికల్లో పోటీకి సుముఖంగా ఉన్నట్టు చెప్పి తమకు ఆరు సీట్లు కేటాయించాలని కోరారు. రెండు రోజుల క్రితం హైదరాబాదులో ఉన్నటువంటి రాష్ట్ర పార్టీ కాంగ్రెస్ ఇంచార్జ్ ఠాక్రేతో చర్చలు జరిపారు. కేసీఆర్‌ను ఓడించడం కోసం కోదండరాం పాత్ర అవసరమని కాంగ్రెస్ భావిస్తూ తెలంగాణ జన సమితితో పొత్తు చర్చ జరిపినట్టుగా తెలిపినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి .ఈ మేరకు కోదండరాం ఆరు సీట్లనూ తమ పార్టీ అభ్యర్థుల కేటాయించాలని అందుకు సంబంధించిన జాబితాను ఠాక్రేకు అందజేశారు.

ఉద్యమంగా బహుజన బతుకమ్మ

- అరుణోదయ సాంస్కృతిక పాటల ఆవిష్కరణలో వక్తలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రతి ఏడాది బహుజన బతుకమ్మ ఒక ఉద్యమంలా సాగుతోందని పలువురు వక్తలు కొనియాడారు. అరుణదోయ సాంస్కృతిక సమాఖ్య ఆధ్వర్యంలో రిటైర్డ్ ప్రొఫెసర్ లక్ష్మి అధ్యక్షతన ఆదివారం హైదరాబాద్‌లోని ప్రసాద్ ఐ ల్యాబ్స్‌లో నిర్వహించిన పాటల ఆవిష్కరణ కార్యక్రమంలో ఆంధ్రజ్యోతి సంపాదకులు కె శ్రీనివాస్, సినీ నిర్మాత తమ్మారెడ్డి భరద్వాజ తదితరులు మాట్లాడారు. కె.శ్రీనివాస్ మాట్లాడుతూ బతుకమ్మను ప్రజాస్వామీకరించడానికి, మానవీకరించడానికి సంప్రదాయ బతుకమ్మలో లోపాలను సవరించుకుంటూ మహిళా ఉద్యమంగా మార్చుకోవడం అభినందనీయమన్నారు. ఇది ఒక సామాజిక ఉద్యమంగా మారిందని తెలిపారు. సినీ నిర్మాత తమ్మారెడ్డి భరద్వాజ మాట్లాడుతూ, విమల లాంటి వారు ఇంకా ఆ భావజాలంతో కొనసాగుతుండటం అభినందనీయమన్నారు. వ్యాపారం, పర్యాటకం మద్యంతో ముడిపడి ఉన్నాయంటూ ప్రభుత్వాలు దాన్ని ప్రోత్సహిస్తున్నాయని విమర్శించారు. ప్రభుత్వానికి డబ్బు మీద ఉన్న ప్రేమ ప్రజలపై లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. మద్యం సమస్యపై సాంస్కృతికంగానే ప్రజల్లోకి వెళ్లాలని ఆయన సూచించారు.

రిటైర్డ్ ప్రొఫెసర్ లక్ష్మి మాట్లాడుతూ 2011 నుంచి బహుజన బతుకమ్మ పేరుతో దళితులను పండుగలో భాగస్వాములను చేసే ప్రయత్నం కొనసాగుతున్నదని తెలిపారు. తెలంగాణ వచ్చినా ఇంకా సామాజిక సమస్యలు పరిష్కారం కాలేదని చెప్పారు. ప్రభుత్వాలు మద్యాన్ని, మత్తును ఆదాయ వనరులుగా చూస్తూ యువతను నిర్వీర్యం చేస్తూ నేరస్తులుగా మారుస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళలపై అఘాయిత్యాలు పెరగడానికి మత్తు కూడా కారణమని చెప్పారు. రాష్ట్రంలో మద్యం ఆదాయం రూ.మూడు వేల కోట్ల నుంచి రూ.40 వేల కోట్లకు పెరిగిందని, అదే క్రమంలో మహిళలపై అఘాయిత్యాలు కూడా పెరిగాయని చెప్పారు. గ్రామాల్లో బెల్ట్ షాపులకు వ్యతిరేకంగా పోరాడాలని పిలుపునిచ్చారు. మహిళలకు అన్ని రంగాల్లో భాగస్వామ్యం కల్పించినప్పుడే ప్రజాస్వామిక తెలంగాణ ఆవిర్భవిస్తుందని చెప్పారు. ప్రొఫెసర్ కొల్లాపురం విమల మాట్లాడుతూ బతుకమ్మ మహిళల హక్కులను గుర్తు చేసే పండుగ అని తెలిపారు. తుర్లపాటి లక్ష్మి మాట్లాడుతూ పల్లె పడుచులు తమ బాధలను మరిచిపోయేందుకు చేసుకునే పండుగ బతుకమ్మ అని తెలిపారు. మాష్టార్జీ మాట్లాడుతూ మాతృస్వామ్య వ్యవస్థను తిరిగి తెచ్చే పండుగ బతుకమ్మ అని తెలిపారు. ఈ కార్యక్రమంలో పూసే పూల కవాతు పాటను ఈడుగు కౌసల్యాశంకర్ , రావె రావె బతుకమ్మ రావే పాటను మాష్టార్జీ ఆవిష్కరించారు. అరుణోదయ విమల మాట్లాడుతూ ఈ ఏడాది మద్యం రద్దు–మగువల రక్షణ అనే అంశాలపై పండుగను నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో మోదుగుపూల పత్రిక ఎడిటర్ భూపతి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుపై బైఠాయించిన విద్యార్థినులు

సరైన భోజనం పెట్టడం లేదు

- వసతి గృహ బాలికలు రోడ్డుపై బైఠాయింపు

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

హాస్టల్‌లో తమకు సరైన భోజనం, అల్పాహారం పెట్టడంలేదని జయశంకర్-భూపాలపల్లి జిల్లా చిట్యాల మండల కేంద్రంలోని ఎస్‌సి హాస్టల్ విద్యార్థినులు నిరసన తెలిపారు. ఆదివారం మండల కేంద్రంలోని ప్రధాన కూడలి వద్ద రోడ్డుపై బైఠాయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రెండు రోజుల నుండి తమకు సరైన టైంలో అల్పాహారం, భోజనం సరిగా పెట్టడంలేదని ఆరోపించారు. హాస్టల్ వార్డెన్ పట్టించుకోవడంలేదని తెలిపారు. సంబంధిత కాంట్రాక్టు వర్కర్లను అడిగితే తమకు జీతాలు ఇవ్వడం లేదని, తాము ఎక్కడ నుండి తెచ్చిపెట్టాలని అంటున్నారని అన్నారు. సంబంధిత బాధ్యులపై చర్య తీసుకుని తమకు సమయానికి భోజనం అందేలా చర్యలు తీసుకోవాలని వేడుకున్నారు. విద్యార్థులు బైటాయించిన ప్రాంతానికి పోలీసులు చేరుకొని వారికి నచ్చజెప్పి హాస్టల్‌కు పంపించారు.

ఆటో, క్యాబ్ మీటర్ ఛార్జీలను పెంచాలని 15న చలో ఇందిరా పార్క్

- పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఆటో, క్యాబ్ మీటర్ ఛార్జీలను ప్రభుత్వం పెంచకపోతే బిఆర్ఎస్ పార్టీని చిత్తుగా ఓడిస్తామని తెలంగాణ మోటార్ ట్రాన్స్‌పోర్ట్ డ్రైవర్స్ యూనియన్ అధ్యక్షులు బైరగోని రాజు గౌడ్ హెచ్చరించారు. హైదరాబాద్ దేశోద్ధారక భవన్‌లో ఆదివారం తెలంగాణ మోటార్ ట్రాన్స్‌పోర్ట్ డ్రైవర్స్ యూనియన్, తెలంగాణ సెక్యూర్ డ్రైవర్స్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో అక్టోబర్ 15న చేపట్టనున్న చలో ఇందిరాపార్క్‌కు సంబంధించిన వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు పెరిగినా ఇప్పటివరకు ఆటో, క్యాబ్ మీటర్ చార్జీలు పెరగలేదని అన్నారు. తమ సమస్యలను ప్రభుత్వం పట్టించుకోవాలన్నారు. కాంగ్రెస్ పార్టీ కూడా రవాణా రంగ కార్మికుల సమస్యలు పరిష్కరిస్తామని వారి ఎన్నికల మేనిఫెస్టోలో చేర్చాలని, లేకుంటే ఓటమి తప్పదని తెలిపారు. గ్రీన్ టాక్స్, క్యాటర్లీ టాక్స్ పేరిట వసూలు చేయడం తక్షణమే ఆపాలని, 30 శాతం కమీషన్ నొక్కి డ్రైవర్లను లూటీ చేస్తున్న కార్పొరేట్ ఓలా, రాపిడో, ఉబర్ సంస్థలను తక్షణమే నిషేధించి, ప్రభుత్వమే ట్రావెలింగ్ యాప్‌ను ప్రవేశపెట్టాలని కోరారు. మినిమం కమీషన్‌తో డ్రైవర్లకు బుకింగ్ సౌకర్యం కల్పించాలని అయన విజ్ఞప్తి చేశారు. ప్రధాన కార్యదర్శి బొంగు రవి గౌడ్ మాట్లాడుతూ పెరిగిన ఇంధన ధరలకు అనుగుణంగా వెంటనే ఐటీ సెక్టార్ క్యాబ్ చార్జీలు పెంచాలన్నారు. అర్హత కలిగిన ప్రతీ డ్రైవర్‌కు సబ్సిడీ వాహనాలు అందించి ఇల్లులేని పేద డ్రైవర్లకు డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు కేటాయించాలని కోరారు. ఈ సమావేశంలో యూనియన్ కార్యనిర్వాహక అధ్యక్షులు కల్వకొను సురేందర్ రెడ్డి, కార్యనిర్వాహక కార్యదర్శి మహేష్ ముదిరాజ్, వ్యవస్థాపక అధ్యక్షులు దుసారి రాజు గౌడ్, కోశాధికారి సిలివేరు నరసింహ, ప్రచార కమిటీ చైర్మెన్ పొడుగు శ్రీకాంత్, ఖమ్మం జిల్లా అధ్యక్షులు పెరుగు బిక్షం, కార్యవర్గ సభ్యులు కె.రమేష్, చంద్రశేఖర్ రెడ్డి, కుమార్ యాదవ్, భారత్ ముదిరాజ్, అడ్వైసర్ డి.ఆర్.రాము పాల్గొన్నారు.

గంజాయి మత్తులో హత్య

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

నల్గొండ జిల్లాలో దారుణం చోటు చేసుకుంది. గంజాయి మత్తులో తోటి స్నేహితుని గొంతు కోసి పారిపోయాడు. ఈ విషాదకర సంఘటన ఆదివారం నాగార్జునసాగర్ హిల్ కాలనీలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. గంజాయి మత్తులో నితిన్ అనే యువకుడు స్నేహితుడు విష్ణు గొంతి కోసి పారిపోయాడు. గాయపడిన విష్ణును సహచరులు దవాఖానకు తరలించారు. నిందితుడు నితిన్ ఎఎస్ఐ భిక్షమయ్య కొడుకుగా గుర్తించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ఇండియన్ బ్యాంకు ఆధ్వర్యంలో వాకథాన్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సెంట్రల్ విజిలెన్స్ కమిషన్ పిలుపుమేరకు విజిలెన్స్ అవేర్‌నెస్ వీక్‌లో భాగంగా ఇండియన్ బ్యాంకు హైదరాబాద్ జోనల్ కార్యాలయం ఆధ్వర్యంలో శనివారం హైదరాబాద్‌లో వాకథాన్ నిర్వహించారు. ఫీల్డ్ జనరల్ మేనేజర్ ఎ గనేసరమన్, డిజిఎం జిఎం ఫైజానీ,జోనల్ మేనేజర్ చంద్ర ప్రకాశ్ ఆధ్వర్యంలో లిబర్టీ ప్లాజా నుంచి హిమాయత్ నగర్ క్రాస్‌రోడ్స్ వరకు సాగిన వాకథాన్‌లో జోనల్ కార్యాలయం ఉద్యోగులు, సిబ్బంది ఉత్సాహంగా పాల్గొన్నారు. లంచగొండితనం,అవినీతికి వ్యతిరేకంగా ప్రజల్లో అవగాహన కల్పించేలా ఉద్యోగులు ప్లకార్డులు ప్రదర్శించారు.

తాండూర్ బిఆర్ఎస్‌లో అంతర్గత కుమ్ములాటలు

- పట్నం వర్సెస్ పైలెట్
- తాండూర్‌పైనే పట్నం మహేందర్‌రెడ్డి భవితవ్యం
- పైలెట్‌కు చెక్ పెట్టేందుకు పట్నం క్యాడర్ వ్యూహాలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పట్నం మహేందర్‌రెడ్డి

రోహిత్ రెడ్డి

వికారాబాద్ జిల్లా తాండూర్ నియోజకవర్గ బీఆర్‌ఎస్‌లో అంతర్గత వార్ కొనసాగుతోంది. గతంలో సిట్టింగ్ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్‌రెడ్డి, ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి మధ్య నిత్యం ఓ యుద్ధమే జరిగేది. అయితే దీనిపై అధిష్టానం జోక్యం చేసుకుని ఇరువురి మధ్య సయోధ్య కుదిర్చింది. కానీ పైకి పట్నం, పైలెట్ బాగానే ఉన్నప్పటికీ అంతర్గతంగా వీరి మధ్య వార్ కొనసాగుతూనే ఉంది. కాగా, ఎమ్మెల్యే పైలెట్‌కు మళ్లీ ఎమ్మెల్యే టికెట్ కేటాయించడంతో వారి మధ్య అంతర్గత విభాగాలు మళ్లీ మొదలయ్యాయి. కాగా, ఎమ్మెల్సీ పట్నంను బుజ్జగించేందుకు మంత్రి పదవి కట్టబెట్టింది. దాంతో ఇరువురు నేతలు కలిసిపోయి పార్టీ కోసం పనిచేస్తున్నట్టు బహిరంగంగా కనిపిస్తున్నా వాస్తవం మాత్రం ఇందుకు భిన్నంగా ఉంది. పైలెట్‌కు టికెట్ కేటాయించడాన్ని పట్నం అనుచరులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. రాబోయే ఎన్నికల్లో పైలెట్ గెలిస్తే తమ నాయకుడు పట్నం రాజకీయ భవిష్యత్తు అంధకారమే అవుతుందని ఆందోళన చెందుతున్నారు. దాంతో అధిష్టానం ఆదేశాలను ధిక్కారిస్తూ పైలెట్‌ను ఓడించేందుకు ప్రణాళికలు రచిస్తున్నారు.

ఉమ్మడి రంగారెడ్డి బీఆర్ఎస్‌లో రోజురోజుకు రాజకీయాలు పరిణామాలు వేగంగా మారుతున్నాయి. ఎలాంటి గ్రూపు రాజకీయాలు ఉండకుండా జాగ్రత్త పడాలని బీఆర్ఎస్ అధిష్టానం వేసిన ఎత్తుగడలు ఫలించడం లేదు. అధిష్టానం ఎన్నిచెప్పినా తమ రాజకీయ స్వావలంబన కోసం లీడర్లు ఎంపర్లాడుతున్నారు. తాండూరు నియోజకవర్గాన్ని మరోసారి కైవసం చేసుకోవడానికి బీఆర్ఎస్ ప్రతిష్టాత్మకమైన నిర్ణయం తీసుకుంది. పట్నం మహేందర్‌రెడ్డికి మంత్రి పదవి ఇచ్చి సిట్టింగ్ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్ రెడ్డికి అసెంబ్లీ టికెట్ కేటాయించింది. దీనికి పట్నం సైతం సై అన్నప్పటికీ.. క్యాడర్ మాత్రం పట్నంకు కట్టిమీద కునుకు లేకుండా చేస్తోంది. మున్నాళ్ల ముచ్చటగా ఉన్న మంత్రి పదవి చూసుకుంటే.. రాజకీయ భవిష్యత్తు లేకుండా పోయే ప్రమాదం ఉందని పట్నం అనుచరులు ఆందోళన చెందుతున్నారు.

పట్నం మహేందర్‌రెడ్డి తాండూరు అసెంబ్లీ నుంచి మూడు పర్యాయాలు ప్రాతినిధ్యం వహించారు. ఆయనకు రాజకీయ బిక్షపెట్టింది తాండూరు ప్రజలే. 1994, 2009, 2014 ఎన్నికల వరకు తాండూరుకు ప్రాతినిధ్యం వహించారు. 2018 అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి పట్నంపై కాంగ్రెస్ అభ్యర్థి పైలెట్ రోహిత్‌రెడ్డి విజయం సాధించారు. తరువాత పైలెట్ గులాబీ గూటికి చేరారు. దాంతో పట్నం, పైలెట్ మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమనే విధానంగా వివాదాలు కొనసాగాయి. నిత్యం ఇరుగ్రూపుల మధ్య విభేధాలతో వార్తల్లో నిలిచేవారు. దీనికి చెక్ పెట్టేందుకు అధిష్టానం రంగంలోకి దిగి పట్నంకు ఎమ్మెల్సీగా అవకాశం ఇవ్వడంతో చల్లబడ్డారు. ఇప్పుడు వచ్చే ఎన్నికల్లో సిట్టింగ్ పైలెట్‌కే టికెట్ కేటాయించి, ఎమ్మెల్సీ పట్నంకు మంత్రి పదవి కట్టబెట్టింది. కాగా, పట్నంకు టికెట్ ఇవ్వకపోవడాన్ని పట్నం క్యాడర్ జీర్ణించుకోలేకపోతోంది.

పైలెట్ గెలుపుతో.. పట్నంకు చెక్

రాబోయే ఎన్నికల్లో తాండూరులో బీఆర్ఎస్ అభ్యర్థి పైలెట్ రోహిత్‌రెడ్డి గెలిస్తే మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి రాజకీయ భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారుతుందని పార్టీ క్యాడర్ భావిస్తోంది. పట్నంకు భవిష్యత్‌లో ఎమ్మెల్యేగా పోటీ చేసే అవకాశం ఇక రాక పోవచ్చని అతని అనుచరులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీన్ని దృష్టిలో పెట్టుకుని పట్నం అనుచరులు పైలెట్ రోహిత్ రెడ్డికి వ్యతిరేకంగా గ్రూపు రాజకీయాలకు తెరలేపినట్టు సమాచారం. ఇదే జరిగితే బీఆర్ఎస్‌కు తాండూర్‌లో గడ్డుకాలం తప్పదు.

కార్యక్రమంలో మాట్లాడుతున్న నిమ్స్ డైరెక్టర్ బీరప్ప

నిమ్స్‌లో అన్నిరకాల సంక్లిష్ట శస్త్ర చికిత్సలు విజయవంతం

- డైరెక్టర్ ప్రొఫెసర్ నగరి బీరప్ప

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఎలాంటి సంక్లిష్ట శస్త్ర చికిత్సలైనా నిమ్స్ వైద్యులు విజయవంతంగా పూర్తి చేస్తారని నిమ్స్ డైరెక్టర్ నగరి బీరప్ప అన్నారు. నిమ్స్ ఆస్పత్రి ఆడిటోరియంలో ఆదివారం ఆర్తో అంకాలజి సిపిడి–2023 కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఆర్థోపెడిక్ విభాగం వైద్యులు ఇక్కడికి వచ్చిన రోగులకు నాణ్యమైన వైద్యం అందిస్తున్నట్టు చెప్పారు. జాయింట్ రీప్లేస్‌మెంట్, కిడ్నీ రీప్లేస్‌మెంట్ లాంటి చికిత్సలను విజయవంతంగా నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ప్రయివేటు ఆస్పత్రుల్లో రూ.లక్షల్లో ఖర్చవుతుందని, ఇక్కడ ఎలాంటి పైసలూ లేకుండా ఉచితంగా సేవలను అందిస్తున్నట్టు చెప్పారు. సర్జికల్ గ్యాస్ట్రో ఎంటరాలజీ విభాగం వైద్యులతో అన్ని విభాగాల వైద్యులు ప్రత్యేక చొరవతో మెరుగైన వైద్యం అందిస్తున్నారని చెప్పారు.